క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు నేడు, రేపు అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: విద్యుత్ మరమ్మతుల నిమిత్తం గురువారం డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ బుధవారం తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ కోలమూరు, రాయుడు పాకలు, పరిమినగర్, ఎన్‌వీబీ లేఅవుట్ ,కంటిపూడి లేఅవుట్ ఏరియా, కొంతమూరు గ్రామంలోని బొమ్మన కాలనీ, వెంకటేశ్వర ప్లాస్టిక్ ఏరియాల్లో ప్రభావం ఉంటుందన్నారు. అలాగే శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ కలిగే అంతరాయంతో నగరంలోని పుష్కరాల రేవు, గోదావరి గట్టు, హెడ్ వాటర్ వర్క్స్, సర్కిల్ ఆఫీస్, రంభ ఊర్వశి థియేటర్, కూరగాయల మార్కెట్, సోమాలమ్మ గుడి వీధి, కొత్తపేట, చర్చ్ పేట, రౌతు తాతలు కల్యాణ మండపం పక్క వీధి, గుబేలుపేట, పల్లపు వీధి, రంభ వారి వీధి, స్టేడియం మెయిన్ రోడ్ , మెయిన్ రోడ్, ట్రైనింగ్ కాలేజీ రోడ్, డీలక్స్ సెంటర్, శ్యామల సెంటర్, హోటల్ జగదీశ్వరీ స్ట్రీట్, గొల్లవీధి, రామానుజం వీధి తదితర ప్రాంతాల్లో ప్రభావం ఉంటుందన్నారు. కొంతమూరులోని రాజరాజేశ్వరీ నగర్, ఎస్ఎస్ఆర్ఆర్ లేఅవుట్, సున్నంబట్టీ రోడ్, నూకాలమ్మ ఆలయ ప్రాంతం, మెయిన్‌రోడ్, అఫీషియల్ కాలనీ, చందన రమేష్ లేఅవుట్, చెంచు కాలనీ, విడో కాలనీ, తేజానగర్ ప్రాంతాల్లో ప్రభావం ఉంటుందన్నారు.

ఏటీఎం కార్డు మార్చేసి..

కడియం: గుర్తుతెలియని వ్యక్తి ఏటీఎం కార్డును మార్చేసి తన బ్యాంకు ఖాతా నుంచి రూ.30 వేలు డ్రా చేశాడంటూ వేమగిరి జక్కంపూడి నగర్‌కు చెందిన మేడిశెట్టి రజిత బుధవారం కడియం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసుల కథనం ప్రకారం.. వేమగిరికి చెందిన రజిత ఈ నెల 20న కడియం దేవీసెంటర్‌లో ఎస్‌బీఐ ఏటీఎంకు వెళ్లింది. అక్కడ గుర్తుతెలియని వ్యక్తి రజితను మాటల్లో పెట్టి ఆమె ఏటీఎం కార్డును మార్చి వేరు కార్డు ఇచ్చారు. ఆ తరువాత తన ఏటీఎం కార్డు ద్వారా బ్యాంకు ఖాతాలోని రూ.30 వేలు నగదు డ్రా చేశాడని రజిత పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు కడియం పోలీస్ స్టేషన్ ఎస్సై బి.నాగదుర్గాప్రసాద్ కేసు నమోదు చేశారు.

వైభవంగా ఉర్స్ గంధోత్సవం



గంధోత్సవంలో పాల్గొన్న అమరున్నీషా బేగం

సీటీఆర్ఐ: హజరత్ మహబూబ్ సుభానీ బాబావారి 65వ ఉర్స్ గంధోత్సవం బుధవారం అంగరంగ వైభవంగా జరిగింది. మధ్యాహ్నం 2 గంటల నుంచి వివిధ కార్యక్రమాలను దర్గా నిషానీ సయ్యద్ అమీరున్నీషా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఒంటేలు గుర్రాలు, మేళతాళాలు, ఫకీరులతో గంధాన్ని ఊరేగించారు. నెహ్రూనగర్, రాజేంద్రనగర్, వై.జంక్షన్ వరకూ ఊరేగింపుగా తీసుకు వెళ్లి తిరిగి దర్గా వద్దకు వచ్చారు. గంధ మహోత్సవంలో ముస్లిం, హిందువులు పాల్గొన్నారు. దర్గా అధ్యక్షుడు సయ్యద్ గౌస్ మొహిద్దీన్ గంధాన్ని అందరికీ అందజేశారు.

స్పా సెంటర్లపై పోలీసుల దాడి

కంబాలచెరువు: స్థానిక జేఎన్ రోడ్డులోని రెండు స్పా సెంటర్లపై బుధవారం రాత్రి ప్రకాశ్‌నగర్ పోలీసులు దాడి చేశారు. పోలీసులకు న్యూట్రెండ్జ్, బ్యూటీ మ్యాజిక్ స్పా సెంటర్లలో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందింది. దీంతో పోలీసు బృందాలు ఆ ప్రాంతాలపై దాడి చేశాయి. ఆరుగురు మహిళలు, ముగ్గురు విటులను పోలీసులు పట్టుకున్నారు. స్పా సెంటర్ నిర్వాహకుడిపై కేసు నమోదు చేశారు.

బంగారు ఆభరణాల చోరీ

కంబాలచెరువు: రాజమహేంద్రవరం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో వేర్వేరు ప్రాంతాల్లో నడిచి వెళ్తున్న ఇద్దరు మహిళల మెడల్లోంచి గుర్తు తెలియని వ్యక్తులు 13 కాసుల బంగారాన్ని లాక్కుని పారిపోయిన సంఘటనలు బుధవారం చోటుచేసుకున్నాయి. కొంతమూరుకు చెందిన సి.అన్నపూర్ణ దుస్తులు కొనేందుకు కోటగుమ్మం వచ్చింది. అక్కడి నుంచి నడుచుకుంటూ వెళ్తుండగా వాహనంపై వెనుక నుంచి వచ్చి వారు ఆమె మెడలోని 9 కాసులు బంగారు గొలుసును లాక్కుని పారిపోయారు. సుబ్బారావునగర్‌కు చెందిన కనకమహాలక్ష్మి క్వారీ మార్కెట్‌కు వెళ్లింది. పని ముగించుకుని ఇంటికి నడిచి వస్తుండగా వెనుక నుంచి వచ్చి ఆమె మెడలోని నాలుగు కాసుల బంగారం గొలుసుకుని లాక్కుని పారిపోయాడు. రెండు ఘటనలపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



శాటిలైట్‌సిటీలో కూరగాయలు, ఆకుకూరల మొక్కల పెంపకం



బుచ్చియ్యనగర్ పంచాయతీ సామాజిక స్థలంలో ఆకుకూరల మొక్కలు

ఆహారం.. ఆరోగ్యం

- ఆకు కూరలతో సంపూర్ణ పోషకాలు
- అంగన్‌వాడీ కేంద్రాల వద్ద పోషణ వాటికలు

రాజమహేంద్రవరం రూరల్: ఆరోగ్యమే మహాభాగ్యం అంటుంటారు పెద్దలు.. అటువంటి సంపూర్ణ ఆరోగ్యానికి బాటలు పడుతున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాల్లో భోజనం చేస్తున్న చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు సంపూర్ణ పోషక విలువలతో కూడిన ఆహారం అందించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం గతేడాది అక్టోబర్‌లో పోషణ వాటిక పథకాన్ని ప్రవేశపెట్టింది. పక్కా భవనం ఉన్న ప్రతి అంగన్‌వాడీ కేంద్రానికి రూ.10 వేలు కేటాయించి, నిధులు విడుదల చేసింది. ఈ నిధులతో అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో ఫెన్సింగ్ ఏర్పాటు చేసి ఆకు, కూరగాయల మొక్కల పెంపకాన్ని ప్రోత్సహించింది. రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం కడియం, **రూరల్ మండలంలో 211 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. అంగన్‌వాడీ కేంద్రాల సొంత భవనాల ఆవరణలో తోటకూర, గోంగూర, మెంతికూర,** చుక్కకూర, బచ్చలికూర, పాలకూరతో పాటు వివిధ రకాల కూరగాయలు పండిస్తున్నారు. సొంత భవనాలు ఉండి ఆకుకూరలు, కాయగూరలు పండించేందుకు స్థలం అందుబాటులో లేకపోతే మూడు లేదా ఏడు సెంటర్లు కలిపి పంచాయతీకి చెందిన సామాజిక స్థలాన్ని తీసుకుని పండిస్తున్నారు.

రక్తహీనతకు చెక్..

గర్భిణులు, బాలింతలు ఆకుకూరలు ఎక్కువ తినడం వల్ల రక్తహీనత సమస్యలు తలెత్తవు. ఈ కూరలు తినడంతో రక్తశాతం వృద్ధి చెంది పుట్టిన బిడ్డలకు లేదా పుట్టబోయే వారు రక్తహీనత సమస్యల నుంచి గట్టెక్కడంతో పాటు ఆరోగ్యకరంగా పెరుగుతారని వైద్య సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు. **దానికి అనుగుణంగా వారికి అలాంటి ఆహార ఉత్పత్తులు అందించడానికి చర్యలు చేపడుతున్నారు.**

పోషణ వాటిక వివరాలు

రాజమహేంద్రవరం రూరల్ మండలంలో 129 అంగవాడీ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో సొంత భవనాలు ఉన్న 46 అంగన్‌వాడీ కేంద్రాలు, కడియం మండలంలో 82 అంగవాడీ కేంద్రాలకు గారు సొంత భవనాలు ఉన్న 29 చోట్ల పోషణ వాటికలు ఏర్పాటు చేశారు. స్థలాలు అందుబాటులో లేనిచోట మూడు, నాలుగు, ఏడు సెంటర్లు కలిపి పంచాయతీ సామాజిక స్థలాల్లో ఆకుకూరలు, కూరగాయలు పండిస్తున్నారు. ఇప్పటికే పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ వాటికలో పెంచిన ఆకుకూరలు, కూరగాయలను వినియోగంలోకి తీసుకువచ్చారు. ఇంకా పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ వాటికలను సిద్ధం చేసే పనులు చివరి దశలో ఉన్నాయి.

ఆకుకూరలు అందిస్తున్నాం



అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో మూడు సెంటర్లు కలిపి ఇక్కడ ఆకుకూరలు, కూరగాయలు పండిస్తున్నారు. గర్భిణులు, బాలింతలకు ఆకుకూరలు అందిస్తున్నాం. చిన్నారులకు మధ్యాహ్న భోజనంలో ఆకుకూరలు వండి వడ్డిస్తున్నాం. ఇది ఎంతో పోషకాహారంగా ఉంటుంది.

– జీవీ రమాదేవి, అంగన్‌వాడీ టీచర్, శాటిలైట్‌సిటీ

పోషణ వాటికను ఏర్పాటు చేశాం



మూడు అంగన్‌వాడీ కేంద్రాలకు **కలిపి పంచాయతీ** సామాజిక స్థలం**లో పోషణ వాటిక**ను ఏర్పాటు చేశాం**. ఆకుకూరలు,** వివిధ రకాల కూరగా**యల మొక్కలు** పెంచుతున్నాం. సేం**ద్రియ ఎరువును** సైతం ప్రకృతి వ్యవసాయ **అధికారుల సూచ**నల మేరకు తయారు చేస్తున్నాం. **ఇలా మంచి ఆహా**ర ఉత్పత్తులు పండిస్తున్నాం.

– విజయలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్, బుచ్చియ్యనగర్

కార్యక్రమం విజయవంతం



రాజమహేంద్రవరం రూరల్, **కడియం మండలా**ల్లో సొంత భవనాలు ఉన్న 75 అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ వాటిక కార్యక్రమం నిర్వహిస్తున్నాం. ఆకుకూరలు, కూరగాయలు పండిస్తున్నాం. స్థలాలు లేనిచోట ముగ్గురు, నలుగురు కలిపి పంచాయతీ సామాజిక స్థలాల్లో పండిస్తున్నారు. అద్దె భవనాల్లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలకు వీరి ద్వారా ఆకుకూరలు అందిస్తున్నాం. ఇది సత్ఫలితాలను ఇస్తుంది.

– నాగమణి, సీడీపీఓ, ఐసీడీఎస్ ప్రాజెక్టు, రాజానగరం

నూరు శాతం ఫలితాలు సాధించాలి

కడియం: రానున్న 50 రోజులు కష్టపడి చదివి మంచి మార్కులతో నూరు శాతం ఫలితాలు సాధించాలని కడియం ఉప సర్పంచ్, మండల టీడీపీ అధ్యక్షుడు ఎలుగుబంటి రఘురామ్ (నాని) అన్నారు. శ్రీవెలుగుబంటి రామచంద్ర రావు చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పదో తరగతి, ఇంటర్ విద్యార్థులకు సాయంత్రం వేళల్లో ప్రతి రోజు స్నాక్స్ ఇస్తామని తెలిపారు. ఎంపీపీ వెలుగుబంటి వెంకట సత్యప్రసాద్ ఆధ్వర్యంలో గతంలో స్నాక్స్ అందించిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు టి.సత్యనారాయణ మాట్లాడుతూ ఈ ఏడాది పదో తరగతి విద్యార్థులు 168 మంది పరీక్ష రాస్తున్నారని, వీరిని ప్రతి టీచర్‌కు ఆరుగురు చొప్పున దత్తత ఇచ్చామని, ఉదయం, సాయంత్రం సమయాల్లో ఒక గంట అదనపు క్లాసులు జరుగుతున్న విషయాన్ని తెలియజేశారు. విద్యార్థులకు బిస్కెట్ ప్యాకెట్స్, పాలు అందజేశారు. స్టాఫ్ కార్యదర్శి గొల్లపల్లి సత్యనారాయణ, బి.సువర్ణ వేణి రామచంద్రరావు ట్రస్ట్ వారికి ధన్యవాదాలు తెలియజేశారు.

కందుకూరి గృహాన్ని పరిరక్షిస్తాం..

సీటీఆర్ఐ: సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు గృహాన్ని పరిరక్షించి, పూర్వ వైభవం తీసుకు వస్తామని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. స్థానిక వంకాయల వారి వీధిలో కందుకూరి గృహాన్ని, మెయిన్ రోడ్డులోని టౌన్ హాల్‌ను నగర పాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్, కూటమి నాయకులు, పురావస్తు శాఖ అధికారులతో కలసి బుధవారం సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పురావస్తు శాఖ పరిధిలో ఈ గృహాన్ని పరిరక్షిస్తామని చెప్పారు.

అమ్మభాషను గౌరవిద్దాం



గిడుగు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ రమణమూర్తి తదితరులు



రామ్మూర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గిడుగు రుద్రరాజు తదితరులు

సీటీఆర్ఐ: ఆత్మ విశ్వాసాన్ని పెంచే అమ్మ భాషను గౌరవించడమే గిడుగు రామ్మూర్తికి ఇచ్చే ఘనమైన నివాళి అని నన్నయ విశ్వవిద్యాలయం ఆచార్యులు తరపట్ల సత్యనారాయణ అన్నారు. స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ కళాశాల తెలుగు శాఖ, కళా గౌతమి సంయుక్త నిర్వహణలో గిడుగు వర్ధంతి సభ జరిగింది. ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని మాట్లాడుతూ తెలుగును వాడుక భాషగా సామాన్యులకు చేరువ చేసేందుకు గిడుగు రామ్మూర్తి ఆనాడు పెద్ద పోరాటమే చేశారని అన్నారు. ఇప్పుడు ప్రతి విద్యార్థి తెలుగును కాపాడుకునేందుకు ఇంకా పెద్ద ఉద్యమం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సభకు అధ్యక్షత వహించిన తెలుగు శాఖ అధిపతి డాక్టర్ పీవీబీ సంజీవరావు మాట్లాడుతూ ఏ భాషలోనూ లేనన్ని అక్షరాలు, మరే ఇతర భాషలోనూ లేని అవధాన, సాహిత్య ప్రక్రియలు కలిగిన మధురమైన భాష తెలుగు అని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డీవీ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు. గ్రాంథిక భాషలోని తెలుగు వచనాన్ని వాడుక భాషలోకి తీసుకువచ్చిన గిడుగు రామ్మూర్తి వంశంలో పుట్టడం తన అదృష్టమని అఖిల భారత కాంగ్రెస్ సీడబ్ల్యూసీ సభ్యుడు గిడుగు రుద్రరాజు అన్నారు. స్థానిక కృష్ణసాయి కల్యాణ మండపంలో కాంగ్రెస్ శ్రేణుల మధ్య గిడుగు రామ్మూర్తి వర్ధంతిని నిర్వహించారు. సందర్భంగా ఆయన చిత్రపటానికి రుద్రరాజు పూలమాలవేసి నివాళులు అర్పించారు. గిడుగు తెలుగుభాషా ఉద్యమం రాజమహేంద్రవరం ప్రాంతంలో ఎక్కువగా కొనసాగడం హర్షణీయమన్నారు.

జాతీయ రహదారిపై తనిఖీలు

కడియం: కొవ్వూరు, కొంతమూరు, రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాల్లో వరుసగా గొలుసు చోరీలకు పాల్పడిన దొంగలను పట్టుకునేందుకు జాతీయ రహదారిపై పోలీసులు జల్లెడ పట్టారు. గురువారం ఇద్దరు యువకులు బైక్‌పై వచ్చి వరుసగా మహిళల మెడలో చైన్లను దొంగిలించుకుపోవడంతో జిల్లా ఎస్పీ డి.నరసింహ కిశోర్ పోలీస్ యంత్రాంగాన్ని అలర్ట్ చేశారు. అందులో భాగంగా కడియం మండలం వేమగిరి జంక్షన్‌లో ఇన్‌స్పెక్టర్ ఎ.వెంకటేశ్వరరావు, ఎస్సై దుర్గాప్రసాద్ ఇతర పోలీసు సిబ్బంది ప్రతి బైకును ఆపి ముమ్మర తనిఖీలు చేపట్టారు. నంబర్ ప్లేట్లు, రికార్డులు లేని బైకులపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బైకులపై నంబర్ బోర్డులు లేకపోవడం, ఉన్న వాటిపై ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా మార్పులు



వేమగిరి జంక్షన్‌లో తనిఖీలు చేస్తున్న కడియం ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు

చేయడం వంటి విషయాలపై కేసు నమోదు చేస్తామన్నారు. ఎందుకంటే నంబర్ బోర్డులు సక్రమంగా కనపడకపోతే ఇటువంటి దొంగతనాలు ఇతర సంఘ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడే అవకాశాలు ఉంటాయన్నారు.

గ్రేడ్ -4 కార్యదర్శులుగా పదోన్నతి

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం రూరల్ మండలంలో 12 మంది గ్రామ సచివాలయ కార్యదర్శులకు గ్రేడ్-4 పంచాయతీ కార్యదర్శులుగా పదోన్నతి లభించింది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల గ్రేడ-5 కార్యదర్శులకు పంచాయతీ గ్రేడ్-4 కార్యదర్శులుగా పదోన్నతులు కల్పించిన విషయం తెలిసిందే. ఇందుదులో భాగంగా మండలంలో మొత్తం 25 మంది గ్రామ సచివాలయ గ్రేడ్-5 కార్యదర్శులు ఉండగా, ఇందులో ధవళేశ్వరం-2 సచివాలయ సెక్రటరీ గుత్తా రవికిషోర్, పిడింగొయ్యి-2 సచివాలయ సెక్రటరీ గెద్దం సత్యవరప్రసాద్, హుకుంపేట-3 సచివాలయ సెక్రటరీ కేపీకే శశిధర్, ధవళేశ్వరం-4 సచివాలయ సెక్రటరీ వి.భద్రరావు సూరిశెట్టి, కోలమూరు-3 సచివాలయ సెక్రటరీ సుధీషణ బాకేగరి, కాతేరు-3 సచివాలయ సెక్రటరీ దెయ్యాల భాను సత్యప్రకాష్, హుకుంపేట-4 సచివాలయ సెక్రటరీ నాయుడు మణిదీపిక, పిడింగొయ్యి-3 సచివాలయ సెక్రటరీ లోలుగు లోహిత, శాటిలైట్‌సిటీ-2 సచివాలయ సెక్రటరీ పి.నాగేశ్వరరావు, బొమ్మూరు-4 సచివాలయ సెక్రటరీ కొవ్వూరి హేమలత, బొమ్మూరు-3 సచివాలయ సెక్రటరీ కె.సంధ్యశ్రీవీణ, తొర్రేడు-2 సచివాలయ సెక్రటరీ వీవీవీ సూర్యసుబ్బారావు, శాటిలైట్‌సిటీ-4 సచివాలయ సెక్రటరీ మౌనిక సేలస్ బడాలకు ఈ పదోన్నతి లభించింది. త్వరలో జరగనున్న కౌన్సెలింగ్‌లో వీరిని గ్రేడ్-4 గ్రామ పంచాయతీల్లో కార్యదర్శులుగా నియమిస్తారు. పదోన్నతి పొందిన కార్యదర్శులను ఎంపీడీఓ డి.శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ ఆర్మ్‌స్ట్రాంగ్ తదితరులు అభినందించారు.

కడియం మండలంలో..

కడియం: కడియం మండలంలో నలుగురు గ్రామ సచివాలయ కార్యదర్శులకు గ్రేడ్-4 పంచాయతీ కార్యదర్శులుగా పదోన్నతి లభించింది. మండలంలో మొత్తం 11 మంది గ్రామ సచివాలయ గ్రేడ్-5 కార్యదర్శులు ఉండగా, ఇందులో కడియం సచివాలయం-3 కార్యదర్శి ఎస్.నాగమల్లి, కడియం సచివాలయం-4 కార్యదర్శి ఎల్.శివబాబు, వేమగిరి-2 సచివాలయ కార్యదర్శి కె.పాపారాయుడు, దామిరెడ్డిపల్లి సచివాలయ కార్యదర్శి (ప్రస్తుతం ఇన్‌చార్జ్ పంచాయతీ కార్యదర్శి) బి.ప్రభాకర్‌లకు ఈ పదోన్నతి లభించింది. వీరిని ఎంపీపీ వెలుగుబంటి వెంకట సత్య ప్రసాద్, ఎంపీడీఓ కె.రమేష్ తదితరులు అభినందించారు.

మహానటుడు అక్కినేని

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): విభిన్న పాత్రలు పోషించి మహానటుడిగా ప్రేక్షకుల మదిలో నటసామ్రాట్ అక్కినేని నాగేశ్వర రావు చెరగని ముద్ర వేసుకున్నారని గాయకుడు, ఆర్కెస్ట్రా పితామహుడు జిత్‌మోహన్‌మిత్ర అన్నారు. మహా నటుడు, దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత, నట సామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు వర్ధంతి కార్యక్రమాన్ని స్థానిక జిత్ మోహన్ మిత్ర కళావేదిక వద్ద ఘనంగా నిర్వహించారు. నిమ్మలపూడి గోవింద్ ముఖ్య అతిథిగా పాల్గొని ఏఎన్ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిత్ మోహన్‌మిత్ర మాట్లాడుతూ తన ఆర్కెస్ట్రా తరపున అక్కినేని సత్కరించడం, కలసి నటించడం తన అదృష్టమన్నారు. నిమ్మలపూడి గోవింద్ మాట్లాడుతూ మట్టి మనిషి సీరియల్ షూటింగ్ సమయంలో అక్కినేనితో పరిచయం ఏర్పడిందని, క్రమశిక్షణ కలిగిన జీవితాన్ని గడిపి అందరికీ ఆదర్శంగా నిలిచారని అన్నారు. ముద్రగడ ఏసుబాబు, డాక్టర్ గిరజాల సోమరాజు నాయుడు, పీవీఎస్ కృష్ణారావు, వి.జగపతి, సామ్రాట్ అక్కినేని, బి.సీతారామారావు, సుక్కిరెడ్డి శ్రీనివాస్, గిడ్డి నరసింహమూర్తి, నాగేంద్ర, మిమిక్రీ బుచ్చిబాబు, ఏఎస్ ఆనంద్, రాఘవరావు, కృత్తివెంటి ఫణి, ఎ.కృష్ణ దత్తాత్రేయశర్మ, తాళం మణిధర్ తదితరులు పాల్గొని అక్కినేని చిత్రపటం వద్ద పుష్పాలు ఉంచి నివాళి అర్పించారు. ఆర్కెస్ట్రా గాయనీ గాయకులు పోస్టల్ ప్రసాద్, ఆదిత్య, జీవీఎస్ లక్ష్మీతులసి, సీహెచ్ విశ్వనాథ్ పలు అక్కినేని పాటలు పాడి స్వర నివాళి అర్పించారు.



అక్కినేని చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జిత్‌మోహన్‌మిత్ర, నిమ్మలపూడి గోవింద్

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



విద్యార్థులకు హోమియో మందు వేస్తున్న డాక్టర్ మాధురి

కంబాలచెరువు: సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ అల్లు రామలింగయ్య హోమియో ఆసుపత్రి హౌస్ సర్జన్ డాక్టర్ ఎం.మాధురి విద్యార్థులకు సూచించారు. స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం హోమియో కళాశాల ఆధ్వర్యంలో విద్యార్థులకు హోమియో మందు ఒక డోసు వేసినట్టు మాధురి తెలిపారు. విద్యార్థి దశ నుండే ఆరోగ్యం పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని, పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ అల్లు రామలింగయ్య ప్రభుత్వ హోమియో వైద్య కళాశాల డాక్టర్ బి.హరిత, ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎంవీఎం సుబ్రహ్మణ్యం, ఎస్‌కేవీటీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం ఆర్ఎస్ఎస్ ప్రసాద్, ఉపాధ్యాయులు వరహాగిరి కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలి

సీతానగరం: ఆయా శాఖల అధికారులు తమకు నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని డీఎల్‌డీఓ పి.వీణాదేవి సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో హౌసింగ్, ఎన్ఆర్ఈజీఎస్, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వెలుగు, అంగన్‌వాడీ తదితర శాఖల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయా శాఖల పరిధిలో పనులు ఎంత వరకూ పూర్తయ్యాయని అడిగి తెలుసుకున్నారు. సచివాలయ సిబ్బంది హాజరుపై ఆరా తీశారు. మండలంలో కాలనీలో 1,013 ఇళ్లు హౌసింగ్‌లో ఉండగా, ఇందులో 290 పూర్తయ్యాయని, మిగిలినవి పూర్తి చేయాల్సి ఉందని హౌసింగ్ ఏఈ నాగచక్రం వివరించారు. ఇళ్ల నిర్మాణం మార్చి నెలాఖరుకు పూర్తికాని పక్షంలో బిల్లులు రావడం కష్టమని, సత్వరమే ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని డీఎల్‌పీఓ అన్నారు. ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్య పెంచాలని, వంద రోజుల పనిదినాలు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

పర్యాటక రంగంపై సమగ్ర అవగాహన

కంబాలచెరువు: స్థానిక ఆర్ట్స్ కళాశాల విద్యార్థుల పర్యాటక కేంద్రాల సందర్శన విజయవంతమైందని, పర్యాటక రంగంపై సమగ్ర అవగాహన పెంపొందించుకున్నామని విద్యార్థులు తెలిపారు. రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల పొలిటికల్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో క్షేత్రస్థాయి పర్యటన భాగంగా 4వ సెమిస్టర్‌లోని టూరిజం గైడెన్స్ పేపర్ చేస్తున్న రాజనీతి శాస్త్ర విద్యార్థులు కోనసీమలోని ప్రధాన పర్యాటక కేంద్రాలైన అంతర్వేది, అప్పనపల్లి, అదుర్రు తదితర ప్రాంతాలను బుధవారం సందర్శించారు. అంతర్వేది వరాహ లక్ష్మీనరసింహ స్వామి దేవాలయంలో స్వామిని దర్శించుకున్నారు. అనంతరం అన్నాచెల్లెలు కట్ట గోదావరి–సముద్రం కలిసే ప్రదేశం పడవలో ప్రయాణించి వీక్షించారు. అదేవిధంగా సముద్ర తీరాన్ని సందర్శించారు. అక్కడి నుంచి అప్పన్నపల్లిలో బాల బాలాజీ స్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆదుర్రులోని ప్రాచీన బౌద్ధ స్తూపాలను చూశారు. ఈ పర్యటన ఉద్దేశించి విద్యార్థులు మాట్లాడుతూ చరిత్ర కలిగిన పురాతన ఆలయాలను సందర్శించడంతో పాటు సముద్రంలో పడవ యాత్ర చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. విద్యార్థుల్లో సహకార భావం, నాయకత్వ లక్షణాలు, నైతిక విలువలను పెంపొందించే లక్ష్యంతో ఆయా ప్రాంతాలను సందర్శించినట్టు చెప్పారు. కార్యక్రమంలో పొలిటికల్ సైన్స్ అధ్యాపకులు బాబ్జి, డాక్టర్ కె.సీతా మహాలక్ష్మి, సయ్యద్ ఫరా ఎఫ్రూస్, కేపీబీఎల్ సరోజ, సీహెచ్ రామారావు, ఎ.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పర్యాటక కేంద్రాల సందర్శనకు వెళ్లిన ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు

రూ.కోటితో 614 గుంతల పూడ్చివేత

రాజమహేంద్రవరం సిటీ: ప్రభుత్వ ఆదేశాల మేరకు నగరపాలక సంస్థ పరిధిలో రోడ్లపై ఉన్న 614 గుంతలను రూ.కోటితో పూడ్చామని, ఇంకా పూడ్చాల్సిన గుంతలు ఉంటే వెంటనే గుర్తించాలని కమిషనర్ కేతన్ గార్గ్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఏవీ అప్పారావు రోడ్డు, కోకా భాస్కరమ్మనగర్‌లో రోడ్డు వేయాలని వచ్చిన అభ్యర్థనపై క్షేత్రస్థాయిలో పరిశీలించి రోడ్డు నిర్మాణం కోసం తగిన అంచనాలు తయారు చేయాలని ఆదేశించారు. అదే రోడ్డులో ఉన్న అపార్ట్‌మెంట్ నీటి సరఫరా కనెక్షన్ పరిశీలించారు. వారు వేసుకున్న బోరుకు జియోలజీ శాఖ అనుమతి ఉందా లేదా అని ఆరా తీశారు. షాపుల యజమానులు తమ షాపుల వద్ద తప్పనిసరిగా డస్ట్ బిన్‌లను ఏర్పాటు చేసుకోవాలని, వినియోగించిన చెత్తను అందులో వేసి చెత్త సేకరణ వాహనాలకు అందించాలన్నారు. శానిటేషన్ కార్యదర్శులు తమ పరిధిలో షాపుల వారికి ఈ విషయమై అవగాహన కల్పించాలన్నారు. రోడ్డుపై చెత్త వేసే వారిపై చర్య తీసుకోవాలన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మంచి ర్యాంకు సాధించాలంటే ప్రజల సహకారం చాలా అవసరమన్నారు. తడి, పొడి చెత్తను విడదీసి చెత్త సేకరణ వాహనాలకు అందించడం ద్వారా నగరాన్ని శుభ్రంగా ఉంచవచ్చన్నారు.



క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్న కమిషనర్ కేతన్ గార్గ్

క్వారీ యజమానులు మొండి వైఖరి విడనాడాలి

రాజమహేంద్రవరం సిటీ: ప్రాణాలను హరిస్తున్న క్వారీ గోతుల సమస్యకు ప్రభుత్వం పరిష్కారం చూపించకపోతే ఏ క్షణంలోనైనా తాను దీక్షకు దిగి స్థానిక ప్రజలతో కలసి నేషనల్ హైవేనే దిగ్బంధం చేస్తామని నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ మాజీ చైర్మన్ బర్రే కొండబాబు హెచ్చరించారు. బుధవారం స్థానిక ప్రజలతో కలసి సుబ్బారావు నగర్ క్వారీ గోతుల వద్ద ఆందోళనకు దిగారు. క్వారీ గోతులు వెంటనే పూడ్చాలని, యజమానులు మొండివైఖరి విడనాడాలని, సంబంధిత అధికారుల నిర్లక్ష్యం వీడి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా కొండబాబు మీడియాతో మాట్లాడుతూ క్వారీ గోతులు పూడ్చాలని ఏళ్ల తరబడి పోరాడుతున్నామన్నారు. తాను 2011లో కోర్టును ఆశ్రయించానని, గోతుల్లో పడి ఎవరూ చనిపోకుండా ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసినా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గోతుల్లో నీరు చేరి దోమలు పెరిగిపోయాయని, వీటి వల్ల సుబ్బారావు నగర్, సింహాచలనగర్ ప్రాంతాల్లో నివసించే పేదలు డెంగీ, మలేరియా, ఫైలేరియా వంటి రోగాల బారిన పడుతున్నారన్నారు. అందుకే ఈ క్వారీ గోతుల ప్రాంతాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని కోరారు. ఇక్కడ రైల్వే, రెవెన్యూ, ప్రభుత్వ క్వారీలు కూడా ఉన్నాయని, ప్రభుత్వం దీనిని వాడుకున్నా తమకు అభ్యంతరం లేదన్నారు. సమస్యను పట్టించుకోకుంటే దీక్షకు దిగుతానని కొండబాబు హెచ్చరించారు.



స్థానికులతో కలసి నిరసన వ్యక్తం చేస్తున్న కొండబాబు

ఘనంగా గొంతేలమ్మ జాతర

రాజమహేంద్రవరం రూరల్: వెంకటనగరం గ్రామ దేవత గొంతేలమ్మ జాతర మహోత్సవం మూడో రోజు బుధవారం వైభవంగా జరిగింది. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కోబ్రా డ్యాన్స్, కేరళా వాయిద్యాలు, గారడీ నృత్యాలు ఆహూతులను అలరించాయి. లక్ష్మీ లేబర్ కాంట్రాక్టర్ కో ఆపరేటివ్ సొసైటీ, ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో గ్రామాల అభివృద్ధి ప్రదాత మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు ఉప్పులూరి వీరవెంకట సత్యనారాయణను గ్రామ ప్రజలు ఘనంగా సత్కరించారు. ఆయనను పూలమాలలతో సత్కరించారు. ప్రజలకు ఏ కష్టమొచ్చినా అండగా నిలుస్తూ, గ్రామంలో ఆలయాల నిర్మాణంతో పాటు, గ్రామాభివృద్ధికి స్వీయ నిధులతో ఎనలేని సేవలందించిన సత్యనారాయణ రుణం తీర్చుకోలేనిదని గ్రామ పెద్దలు అన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, లక్ష్మీ లేబర్ కాంట్రాక్టర్ కో ఆపరేటివ్ సొసైటీ, ఆలయ కమిటీ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.



ఉప్పులూరి సత్యనారాయణను సత్కరిస్తున్న సొసైటీ, ఆలయ కమిటీ సభ్యులు